సాక్షి
నల్లగొండ
శుక్రవారం । 20 । జనవరి । 2023



ముగిసిన క్రీడా పోటీలు
నల్లగొండలో జరుగుతున్న ట్రాన్స్‌కో అండ్ డిస్కమ్స్ ఇంటర్ సర్కిల్ క్రీడా పోటీలు గురువారం ముగిశాయి. - 10లో



బౌద్ధమే శరణ్యం
సమాజ రుగ్మతల నివారణకు బౌద్ధమే శరణ్యమని సంఘసేన మహాథేర అన్నారు. - 10లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం 31.0°/18°
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. రాత్రిపూట చలి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

జిల్లా హాకీ జట్టు కెప్టెన్‌గా సింగం మధు

నల్లగొండ టూటౌన్ : రంగారెడ్డి జిల్లా నందిగామలో ఈ నెల 21నుంచి 23 వరకు నిర్వహించనున్న ఏడవ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాలుర హాకీ టోర్నమెంట్‌కు జిల్లా కేంద్రంలోని పెద్దబండకు చెందిన సింగం మధు జిల్లా జట్టు కెప్టెన్‌గా ఎంపికైనట్లు హాకీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కూతురు శ్రీనివాస్‌రెడ్డి, ఇమామ్ కరీం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా జట్టును ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలని కోరారు.

పిల్లలతో పనులు చేయిస్తే చర్యలు



పాఠశాలను పరిశీలిస్తున్న రాంచందర్

కట్టంగూర్: ఇటుక బట్టీల యాజమాన్యం వలస కూలీల పిల్లలతో పనులు చేయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి రాంచందర్‌నాయక్ అన్నారు. గురువారం మండలకేంద్రంలోని రాంనగర్‌లో ఇటుక బట్టీల వద్ద ఏర్పాటు చేసిన వర్క్ సైట్ పాఠశాలను ఆయన సందర్శించారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వలస కార్మికుల కుటుంబాల పిల్లలకు వలంటీర్‌ను నియమించి చదువు చెప్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీలు పోలగోని రవికుమార్‌గౌడ్, అంబర్ల సత్యనారాయణ, పోలగోని లింగస్వామిగౌడ్ ఉన్నారు.

నేడు 'డయల్ యువర్ ఆర్టీసీ డీఎం'

నల్లగొండ రూరల్: ప్రయాణికుల సౌకర్యార్థం శుక్రవారం డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నల్లగొండ డీఎం రాం మోహన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులతోపాటు అమూల్యమైన సలహాలు, సూచనలను ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు సెల్ : 86881 95076 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు.

గురుకులాల్లో మెరుగైన విద్య



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న విష్ణుమూర్తిగౌడ్, గురుకులాల ప్రిన్సిపాల్స్

నల్లగొండ: తెలంగాణ గురుకులాల్లో మెరుగైన విద్య అందుతున్నందున విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మైనారిటీ గురుకులాల ప్రాంతీయ సమన్వయ అధికారి విష్ణుమూర్తిగౌడ్ అన్నారు. మైనారిటీ గురుకులాల్లో వచ్చే విద్యాసంవత్సరానికి సంబంధించి ప్రవేశాల కోసం రూపొందించిన బ్రోచర్‌ను మైనారిటీ గురుకులాల ప్రిన్సిపాళ్లతో కలిసి గురువారం నల్లగొండలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మైనారిటీ గురుకుల విద్యాసంస్థల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. మైనారిటీ విద్యార్థులు సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు సెల్ : 7331170877 నంబర్‌ను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ గురుకులాల ప్రిన్సిపాళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

26న రైతు సంఘాల నిరసన ప్రదర్శన

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : ఈనెల 26న రైతు సంఘాల నిరసన ప్రదర్శన చేపట్టనున్నట్లు ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కోటేశ్వర్‌రావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ ప్రజా సంఘాల బాధ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన రైతు వ్యతిరేక చట్టాలను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ గత సంవత్సరం జనవరి 26న ఢిల్లీలో శాంతియుతంగా ట్రాక్టర్స్ ర్యాలీ నిర్వహిస్తున్న రైతులపై బాష్ప వాయువు ప్రయోగించి, లాఠీచార్జి చేసి, వాహనాలు ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ ఆ రోజున ప్రదర్శన నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఆ పోరాటం ఫలితంగానే నల్ల చట్టాలు రద్దయ్యాయన్నారు. ఈనెల 31 నుంచి ప్రారంభమయ్యే పార్లమెంట్ సమావేశాల్లో రైతులకు కనీసం మద్దతు ధరల చట్టాన్ని అమలు చేయాలని కోరారు . ఈ సమావేశంలో మందారి డేవిడ్ కుమార్, గంట నాగయ్య, శంకర్, సైదులు, కిరణ్ పాల్గొన్నారు.



తొలి రోజు 8,079 మందికి..

- కంటి వెలుగు శిబిరాలు ప్రారంభం

నల్లగొండ టౌన్: రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమం గురువారం జిల్లా వ్యాప్తంగా ప్రారంభమైంది. 74 బృందాల ఆధ్వర్యంలో తొలి రోజు మొత్తం 8,079 మందికి కంటి పరీక్షలు చేశాయి. ఇందులో పురుషులు 4,277 మంది, స్త్రీలు 3,802 మంది ఉన్నారు. కాగా 1,756 మందికి రీడింగ్ అద్దాలు అందజేయగా 1,687 మందికి ప్రిస్కిప్షన్ అద్దాలను రికమండ్ చేశారు. అద్దాలను తర్వాత లబ్ధిదారుల ఇళ్లకు నేరుగా పంపిస్తామని వైద్యాధికారులు తెలిపారు.

మిర్యాలగూడలో మహిళకు కళ్లజోడు పెడుతున్న శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

ఆన్‌లైన్ కష్టాలు!

అంగన్‌వాడీలకు అదనపు పనిభారం

- వివిధ సర్వే పనులు అప్పగిస్తున్న ప్రభుత్వం
- ఆధార్ లింకేజీతో తప్పని ఇబ్బందులు
- రాతపూర్వక రిపోర్టులతోనూ అవస్థలు
- పని ఒత్తిడి తగ్గించాలని వేడుకోలు



సమస్యలు పరిష్కరించాలని సీడీపీఓకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

ఐసీడీఎస్ ప్రాజెక్టులు	అంగన్‌వాడీ కేంద్రాలు	టీచర్లు
7	2,093	2,013

మిర్యాలగూడ: అంగన్‌వాడీలకు ఆన్‌లైన్ కష్టాలు మొదలయ్యాయి. ఉదయం లేచింది మొదలు రాత్రి నిద్రపోయే వరకు ఒకవైపు కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ఆటాపాటలు నేర్పడంతోపాటు పౌష్టికాహారం అందించడం, మరోవైపు ప్రభుత్వం అప్పగించే పనుల నిమిత్తం ఇంటింటికి తిరిగి సర్వేలు నిర్వహించడం, ఇంకోవైపు పల్స్ పోలియో, ఆధార్ లింకేజీ వంటి ఆన్‌లైన్ పనులతో శారీరకంగా, మానసికంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

ఫీవర్ సర్వే మొదలు..

గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించాల్సిన అంగన్‌వాడీ టీచర్లు ఆన్‌లైన్ రిపోర్టులతో అనేక కష్టాలు పడుతున్నారు. ఫీవర్ సర్వే నుంచి మొదలు ఆధార్ కార్డు అనుసంధానం వరకు అన్ని పనులు అప్పగిస్తున్న ప్రభుత్వం పైపెచ్చు ఆన్‌లైన్ నివేదికలు సమర్పించాలంటూ అధికారులు ఒత్తిడి చేస్తున్నారు. ఈ అదనపు పనుల వల్ల అంగన్‌వాడీలు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. పిల్లలకు పాఠశాలపై మక్కువ పెరగడానికి ఆటాపాటలతో ఉత్సాహపరచాల్సిందిపోయి 14 రకాల రాతపూర్వక రిపోర్ట్‌లతో పాటు ఆన్‌లైన్ నమోదుతో కుస్తీలు పడాల్సి వస్తుంది. పైగా ఆరు నెలలుగా అంగన్‌వాడీలకు అద్దె బిల్లులు రాకపోవడం, ఏడాదిగా గ్యాస్, కూరగాయల బిల్లులు అందకపోవడంతో అప్పులు చేసి మరీ పిల్లల కడుపు నింపాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఏడు ప్రాజెక్టుల పరిధిలో 2,013 మంది టీచర్లు..

జిల్లాలో మిర్యాలగూడ అర్బన్, దామరచర్ల, అనుముల, చింతపల్లి, దేవరకొండ, మునుగోడు, నల్లగొండతో కలుపుకొని మొత్తం ఏడు ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. వీటి పరిధిలో 1,833 ప్రధాన, 260 మినీ సెంటర్లు ఉన్నాయి. అయితే ప్రధాన సెంటర్లలో 1,780 మంది టీచర్లు, మినీ కేంద్రాల్లో 233 మంది టీచర్లతోపాటు ఆయాలు 1,689 మంది పనిచేస్తున్నారు.

అందించే సేవలు..

అంగన్‌వాడీ టీచర్లు గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారాన్ని అందిస్తూ తగిన సూచనలు, సలహాలు అందించాలి. అలాగే రికార్డుల నమోదు, గర్భిణులు, చిన్నారుల బరువు, ఎత్తు చూడడం, సెల్‌ఫోన్‌లో గ్రోత్, లబ్ధిదారుల రిజిస్ట్రేషన్, టీహెచ్‌ఆర్ వంటి పనులు చేస్తుంటారు. వ్యాధి నిరోధక టీకాలు ఇవ్వడం వంటి పనులు చేయాలి. ఇంకా బతుకమ్మ చీరల పంపిణీ, బీఎల్‌ఓగా విధులు నిర్వహించడం, చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేయడం వంటి విధులు నిర్వహిస్తుంటారు. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వం అదనపు పనులు కూడా అప్పగించి వాటి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయిస్తుండడంతో ఇక్కట్లు తప్పడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి నెలకు రూ.21వేల వేతనం అందించడంతోపాటు పెండింగ్‌లో ఉన్న టీఏ, డీఏ, ఇంటి అద్దెలను విడుదల చేసి, పెరిగిన ధరలకు అనుగుణంగా ఇంటి అద్దెలు, కూరగాయల బిల్లులు, గ్యాస్ చార్జీలు, టీఏ, డీఏలు పెంచేతూ పనిభారం తగ్గించాలని అంగన్‌వాడీలు కోరుతున్నారు.

ఆన్‌లైన్ విధానం ఎత్తివేయాలి



"ఆన్‌లైన్ విధానాన్ని ఎత్తివేయాలి. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి అద్దె బిల్లులను ప్రతి నెలా చెల్లించాలి. పాలు, పప్పు, గ్యాస్ బిల్లులను వెంటనే చెల్లించాలి. ఇప్పటి నుంచి ఆఫ్‌లైన్ విధానాన్ని కొనసాగించాలి.
– పార్వతి, అంగన్‌వాడీ టీచర్, ఈదులగూడెం

రాజ్యాధికార సాధనే లక్ష్యం



సభలో అభివాదం చేస్తున్న ఆర్.కృష్ణయ్య, చెరుకు సుధాకర్, బీసీ సంఘం నాయకులు

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

నల్లగొండ టౌన్: రాజ్యాధికారం సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న బీసీ ఉద్యమంలో విద్యార్థులు, యువకులు పెద్ద ఎత్తున భాగస్వాములు కావాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఏపీ రాజ్యసభసభ్యుడు ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. గురువారం నల్లగొండ జిల్లా కేంద్రంలో జరిగిన బీసీ విద్యార్థి సంహగర్జన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. బీసీ సంఘాలు చిన్నచిన్న రాయితీల కోసం సమయం వృథా చేయకుండా రాజ్యాధికార సాధన కోసం జరిగే ఉద్యమాలకు నాయకత్వం వహించాలన్నారు. రాష్ట్రంలో జనాభా ప్రాతిపదికన రాజ్యాధికారంలో వాటా ఇవ్వకుండా అణచివేతకు గురిచేస్తున్నారని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పించారని, బీసీలకు అన్ని స్థాయిలలో 50 శాతం వాటాను ఇచ్చారని గుర్తు చేశారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లును పెట్టి చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లను కల్పించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం త్వరలో చేపట్టబోయే జనగణనలో బీసీ కులగణన చేయాలని డిమాండ్ చేశారు. బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లను కల్పించాలన్నారు. బీసీల విద్య, ఉద్యోగ రిజర్వేషన్లలో ఉన్న క్రీమీలేయర్‌ను ఎత్తివేయాలన్నారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ చెరుకు సుధాకర్ మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలు రాబోయే ఎన్నికల్లో బీసీలకు సముచిత స్థానం కల్పించి సామాజిక న్యాయం చేయాలన్నారు. బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీల వెంకటేశ్ మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల స్కాలర్‌షిప్‌లను సంవత్సరానికి రూ.55 వేలకు పెంచాలని, గురుకులాలు, కాలేజీ హాస్టల్‌లకు సొంత భవనాలను నిర్మించాలన్నారు. పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లను వెంటనే విడుదల చేయాలన్నారు. కాస్మోటిక్, మెస్ చార్జీలు పెంచాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం బీసీ సంక్షేమ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఆవిష్కరించారు. ఈ సభలో జిల్లేపల్లి అంజి, మునాస ప్రసన్న, దుడుకు లక్ష్మీనారాయణ, కె.పర్వతాలు, మిర్యాల వెంకటేశం, సింగం లక్ష్మీనారాయణ, ఐతగోని జనార్దన్‌గౌడ్, కంభంపాటి దుర్గవల్లి, శ్రీనివాస్, వినోద్, నరేష్, జివ్వాజి వెంకటేశ్వర్లు, కూరెళ్ల ఉదయకృష్ణ, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.



బీసీ విద్యార్థి సింహగర్జన సభకు హాజరైన విద్యార్థులు

అక్రమ వెంచర్లలో ప్లాట్లు కొనొద్దు

- డీపీఓ విష్ణువర్ధన్‌రెడ్డి

సాక్షి ఎఫెక్ట్..



జప్తివీరప్పగూడెంలో అక్రమ వెంచర్, ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న డీపీఓ, అధికారులు

మిర్యాలగూడ: ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా వేసిన వెంచర్లలో ప్లాట్లు కొనొద్దని, కొంటే ఇబ్బందులు పడాల్సి వస్తుందని డీపీఓ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం సాక్షి దినపత్రికలో 'ప్రభుత్వ భూమిని కాజేయాలని' అనే శీర్షికన ప్రచురితమైన ప్రత్యేక కథనానికి కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి స్పందించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీపీఓ గురువారం మిర్యాలగూడ తహసీల్దార్ అనిల్‌కుమార్‌తో కలిసి జప్తివీరప్పగూడెం గ్రామంలోని అక్రమ వెంచర్, కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేఅవుట్ చేయాలంటే ముందుగా టెంపరరీ లేఅవుట్ అనుమతి వచ్చిన తరువాత గ్రామపంచాయతీకి పదిశాతం భూమి పట్టా చేయాలన్నారు. మరో 15శాతం ప్లాట్లు పంచాయతీ మార్ట్‌గేజ్ చేసిన తరువాత పూర్తిగా ప్రభుత్వ నిబంధనల మేరకు మౌలిక వసతులు కల్పించిన తరువాతనే ప్లాట్ల విక్రయాలు జరపాలన్నారు. తహసీల్దార్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ భూమి చుట్టు త్వరలో ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తామని, కబ్జాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారి వెంట ఎంపీఓ వీరారెడ్డి, ఆర్ఐ శ్యాంసుందర్ ఉన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు ప్రశంసనీయం




విద్యార్థులకు అల్పాహారం అందజేస్తున్న డీఈఓ

మునుగోడు: ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న పదో తరగతి విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అల్పాహారం అందించడం ప్రశంసనీయమని డీఈఓ భిక్షపతి అన్నారు. మండలంలోని 7 ఉన్నత పాఠశాలలకు చెందిన పదో తరగతి విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఇంటర్ నేషనల్ ఆధ్వర్యంలో ఉదయం, సాయంత్రం సమయంలో ఉచితంగా అందజేసే అల్పాహారం కార్యక్రమాన్ని గురువారం మునుగోడు ఉన్నత పాఠశాలలో డీఈఓ చేతుల మీదుగా ప్రారంభించి మాట్లాడారు. నూరు శాతం ఫలితాల సాధనకు విద్యార్థులు, ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యా అధికారి కె.నర్సింహ, లయన్స్ క్లబ్ సభ్యులు కర్నాటి నారాయణ, కందుకూరి మహేందర్, హెచ్ ఎం ఎస్.యాదయ్య పాల్గొన్నారు.

ఖాళీల జాబితాపై కసరత్తు..

- సర్వీస్ బుక్కుల వారీగా పదోన్నతుల వివరాలు పరిశీలిస్తున్న అధికారులు
- నేడు జాబితా విడుదల చేసే అవకాశం



నల్లగొండ: విద్యాశాఖలో ఖాళీలు, పదోన్నతుల జాబితా సిద్ధం చేసేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఎనిమిదేళ్లుగా విద్యాశాఖలో పదోన్నతులు, బదిలీల ప్రక్రియ నిలిచిపోయింది. ఎట్టకేలకు ప్రభుత్వం తాజాగా విద్యాశాఖలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు కల్పించేందుకు షెడ్యూల్ ప్రకటించింది. జిల్లాలో ఇందుకు అర్హత సాధించిన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. అదే క్రమంలో అధికారులు కూడా జిల్లాలో ఐదేళ్లపాటు ఒకేచోట పని చేసిన ఉద్యోగులను బదిలీ చేయాలని నిర్ణయించారు.

ఉన్నత విద్యాశాఖ ఆదేశం మేరకు..

అయితే రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ అధికారులు జిల్లాల వారీగా ఆయా కేటగిరీల్లో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు సంబంధించి జాబితాలు ప్రకటించాలని ఆదేశించింది. దీంట్లో భాగంగా జిల్లాలో వివిధ కేటగిరీల వారీగా బదిలీలకు అర్హులైన వారి జాబితాతో పాటు సీనియార్టీ ప్రకారం పదోన్నతులకు సంబంధించిన జాబితాను కూడా సిద్ధం చేస్తున్నారు. వాస్తవానికి గురువారమే జాబితా ప్రకటించాలని ఆదేశాలుండడంతో అధికారులు రెండు రోజుల నుంచి అదే పనిలో నిమగ్నమయ్యారు. మండల విద్యా అధికారులు పాఠశాలల వారీగా ఐదేళ్లకు పైబడి ఒకేచోట పనిచేసిన వారి జాబితాను సిద్ధం చేయడంతో పాటు పదోన్నతులకు సంబంధించిన జాబితాను సిద్ధం చేస్తున్నారు. అయితే ఈ జాబితా తయారీలో అక్కడక్కడా చిన్న చిన్న తప్పిదాలు దొర్లాయి. దీంతో జాబితా ప్రకటనలో జాప్యం చోటు చేసుకుంది. దీంతో విద్యాశాఖ అధికారులు సర్వీస్ బుక్కులను పరిశీలిస్తున్నారు. గురువారం అర్ధరాత్రి వరకు ప్రక్రియ పూర్తి చేసి శుక్రవారం జాబితాను ప్రకటించే అవకాశం ఉంది.

యాదాద్రిలో శాస్త్రోక్త పూజలు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం నిత్య పూజలు శాస్త్రోక్తంగా కొనసాగాయి.వేకువజామున ప్రధానాలయాన్ని తెరిచిన ఆచార్యులు సుప్రభాతం, ఆరాధన, స్వయంభూలకు నిజాభిషేకం నిర్వహించి తులసీ దళాలతో అర్చించారు. ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన, వేద ఆశీర్వచన పూజల్లో భక్తులు పాల్గొన్నారు. నిత్యాదాయం రూ.19,65,432 సమకూరినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

బీజేపీ వ్యతిరేక శక్తులతో కలిసి పనిచేస్తాం



మాట్లాడుతున్న తమ్మినేని, పక్కన జూలకంటి

మునగాల(కోదాడ): కేంద్రంలో ప్రస్తుతం అధికారంలో ఉన్న బీజేపీ వ్యతిరేక శక్తులతో పనిచేసేందుకు తమ పార్టీ సిద్ధంగా ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం స్పష్టం చేశారు. గురువారం మునగాల మండల కేంద్రంలో సీపీఎం సీనియర్ నాయకుడు ఉప్పుల కాంతారెడ్డి సంస్మరణ సభకు హాజరయ్యేందుకు వచ్చిన ఆయన స్థానికంగా విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ హక్కులను మోదీ ప్రభుత్వం కాలరాస్తోందని ఆరోపించారు. మోదీ ప్రభుత్వం, బీజేపీ అనుసరిస్తున్న విధానాలతో నేడు దేశానికి పెను ప్రమాదం పొంచి ఉందని హెచ్చరించారు. మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు బీఆర్‌ఎస్‌తో కలిసి పనిచేస్తున్నామన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న మతతత్వ బీజేపీ, మోదీ విధానాలకు వ్యతిరేకంగానే బీఆర్‌ఎస్ ఉద్భవించిందని ప్రకటించిన కేసీఆర్‌తో కమ్యూనిస్టులు కలిసి పనిచేసేందుకు ముందుకు వచ్చారన్నారు. రాష్ట్రంలో 12లక్షల ఎకరాల పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, దళితులకు మూడెకరాల భూమి , డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లు, పెండింగ్‌లో ఉన్న ధరణి భూముల సమస్యలు, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి తదితర ఎన్నికల హామీలను అమలుచేయాలని ఇప్పటికే సీఎం కేసీఆర్‌కు లేఖలు రాసినట్లు తెలిపారు. సమావేశంలో జూలకంటి రంగారెడ్డి, మల్లు లక్ష్మి పాల్గొన్నారు.

పోలీస్ ఉద్యోగార్థులకు న్యాయం చేయండి

- యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి

నల్లగొండ: పోలీస్ ఉద్యోగ నియామకాల్లో జరిగిన అవకతవకలను నిరసిస్తూ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌ను ముట్టడించారు. ముందుగా డైట్ కళాశాల నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ క్రమంలో లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించిన వారందరినీ పోలీసులు అడ్డుకొని అరెస్ట్ చేసి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. స్టేషన్‌లో కూడా నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజా రమేష్ యాదవ్ మాట్లాడుతూ పోలీస్ రిక్రూట్‌మెంట్‌లో అవకతవకలు జరిగాయని, హైకోర్టు తీర్పు ప్రకారం 7 మార్కులను కలపాలని చెప్పినప్పటికీ ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. కఠిన నిబంధనల కారణంగా నష్టపోయే పోలీస్ ఉద్యోగార్థులందరికీ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. న్యాయం చేయకుంటే నిరుద్యోగులతో కలిసి ప్రగతి భవన్‌ను ముట్టడిస్తామన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శులు కొర్ర రాంసింగ్ నాయక్, జరుప్ల లక్ష్మి, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు శ్రీధర్ నాయక్, నాయకులు గాలి నాగరాజు, ఉమేర్ కాశీం, కిన్నెర హరికృష్ణ, అజార్, గుండ జలేందర్ రెడ్డి, మర్రి దేవేందర్ యాదవ్, మామిడి కార్తీక్, అజారుద్దీన్, ముని నాయక్, నాగరాజు, అభిషేక్, రమేష్, నవీన్, అంజన్, తబ్రేజ్, అర్జున్, సతీష్ ,యేసు రాజు, అవినాష్, సాయి పాల్గొన్నారు.





నాయకులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు, వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

క్లుప్తంగా

పత్తిని ఎత్తుకెళ్లిన దొంగలు

మునుగోడు: ఓ రైతు తన వ్యవసాయ బావివద్ద దాచిన పత్తిని దొంగలు ఎత్తుకెళ్లిన సంఘటన బుధవారం రాత్రి మునుగోడులో చోటుచేసుకుంది. వివరాలు.. మునుగోడు గ్రామపంచాయతీ పరిధిలోని లక్ష్మీదేవిగూడేనికి చెందిన ఉప్పునూతల యాదయ్య తన మూడెకరాల భూమిలో పత్తి సాగు చేయగా 20 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. మంచి రేటు వచ్చినప్పుడు అమ్ముదామని ఆ పత్తిని తన వ్యవసాయ బావి వద్ద ఉన్న ఓ గదిలో వేసి తాళం వేశాడు. ఇది గమనించిన దొంగలు బుధవారం రాత్రి ఆ గది తాళం పగులగొట్టి పత్తిని అంతా ఓ వాహనంలో వేసుకొని ఎత్తుకెళ్లారు. యాదయ్య ఉదయం వచ్చి చూసేసరికి గది తాళం పగులగొట్టి ఉండటంతో పాటు గదిలో పత్తి లేకపోవడంతో విషయాన్ని గ్రామస్తులకు తెలియజేశాడు.

ట్రాక్టర్ బోల్తాపడి వ్యక్తి మృతి


బెడద సతీష్ (ఫైల్)

మద్దిరాల (తుంగతుర్తి): ట్రాక్టర్ బోల్తాపడి వ్యక్తి మృతిచెందిన ఘటన మండల పరిధిలోని రెడ్డిగూడెం శివారులో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రెడ్డిగూడెం గ్రామానికి చెందిన బెడద సతీష్(43) ట్రాక్టర్ నడుపుతూ జీవనం సాగి స్తుండేవాడు. గురువారం గ్రామ శివారులో ఓ రైతు పొలం దున్నుతుండగా అకస్మాత్తుగా ట్రా క్టర్ తిరగబడడంతో సతీష్ ట్రాక్టర్ కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని జేసీబీ సహాయంతో ట్రాక్టర్‌ను తొలగించి మృతదేహాన్ని బయటికి తీసి పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తుంగతుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

కారు బోల్తా పడి..


వెంకన్న (ఫైల్)

మునుగోడు: కారు అదుపుతప్పి బోల్తా కొట్టడంతో వ్యక్తి మృతిచెందిన ఘటన గురువారం మునుగోడు మండలంలోని సింగారం గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మునుగోడు మండలంలోని ఊకొండి గ్రామానికి చెందిన కట్లకుంట్ల వెంకన్న(42) ఊర్లో కిరాణ దుకాణం నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం మునుగోడులో సంత కావడంతో కూరగాయలతో పాటు ఇతర సరుకులు తెచ్చేందుకు తన కారులో వెళ్లాడు. సరుకులు తీసుకుని ఊకొండికి తిరిగి వస్తుండగా మార్గమధ్యలో సింగారం గ్రామం దాటిన తర్వాత మూలమలుపు వద్ద కారు అదుపు తప్పి వరి పొలంలోకి దూసుకెళ్లింది. దీంతో కారు బోల్తా పడటంతో వెంకన్న తల పొలంలో చొచ్చుకుపోయి ఊపిరి ఆడకపోవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. చుట్టుపక్కల వారు గమనించి వెంటనే ఓ ప్రైవేట్ వాహనంలో నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. కాగా ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ డి. సతీష్‌రెడ్డి తెలిపారు.

‘తలసేమియా’తో తీరని శోకం

- ఇద్దరు కుమార్తెలను కోల్పోయిన దంపతులు
- కుమారుడికి కూడా అదే వ్యాధి సోకడంతో తల్లడిల్లుతున్న కుటుంబం
- కూలీ పనులు చేసుకుంటున్న వారికి భారంగా మారిన వైద్య ఖర్చులు
- దాతల సాయం కోసం ఎదురుచూపు


తలసేమియా వ్యాధితో బాధపడుతున్న యశ్వంత్

కన్నీటి గాధ

మునగాల(కోదాడ): రెక్కాడితేగాని డొక్కాడని నిరుపేద కుటుంబం వారిది. లక్షల్లో ఒకరికి వచ్చే తలసేమియా వ్యాధితో ఇప్పటికే ఇద్దరు కుమార్తెలను పోగొట్టుకున్నారు ఆ దంపతులు. కుమారుడికి కూడా అదే వ్యాధి సోకడంతో ఎలాగైనా అతడిని కాపాడుకోవాలని తాపత్రయపడుతున్నారు. వివరాలు.. సూర్యాపేట జిల్లా మునగాల మండలం తిమ్మారెడ్డిగూడెం గ్రామానికి చెందిన వింజమూరి వెంకన్న, వెంకటమ్మ దంపతులు వ్యవసాయ కూలీలుగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ముగ్గురు కుమార్తెలు శిరీష, మనీషా, లక్ష్మి, కుమారుడు యశ్వంత్ సంతానం. వీరిలో శిరీష, మనీషా, యశ్వంత్‌కు చిన్నతనంలోనే తలసేమియా వ్యాధి సోకింది. ఈ వ్యాధి బారిన పడి శిరీష తన ఏడవ ఏట, మనీషా తన పదవ ఏట మృతిచెందారు. కుమారుడు యశ్వంత్‌కు ఆరు నెలల వయస్సులోనే తలసేమియా వ్యాధి సోకగా, ప్రస్తుతం అతడికి 15 సంవత్సరాలు నిండాయి. పేద కుటుంబం కావడంతో వైద్య ఖర్చులు భరించలేక ఆ దంపతులు తమ ఇద్దరు కుమార్తెలను బతికించుకోలేకపోయారు. తమ కుమారుడి ఆరోగ్యం రోజురోజుకు క్షీణిస్తూ ఉండడంతో ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నారు. తమ కుమారుడి వయస్సు పిల్లలంతా పాఠశాలలకు వెళ్లి చదువుకుంటుంటే తను మాత్రం ఇంటి దగ్గరే ఉంటున్నాడని ఆ తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతినెలా రక్తమార్పిడి కోసం రూ.5వేలు ఖర్చు అవుతుండడంతో ఆ దంపతుల కూలీ డబ్బులు వైద్య ఖర్చులకే సరిపోతున్నాయి. ఒకవైపు తమ కుమారుడి వైద్య ఖర్చులు భరించలేక మరోవైపు పూట గడవక ఇబ్బందులు పడుతున్నారు. దయార్ధ హృదయులు ఎవరైనా సాయం చేస్తే తమ కుమారుడిని మరికొంత కాలం బతికించుకుంటామన్న ఆశతో ఎదురుచూస్తున్నారు. దాతలు ముందుకు వస్తే 8499094597కు సమాచారం ఇవ్వాలని వెంకన్న, వెంకటమ్మ దంపతులు వేడుకుంటున్నారు.

వింజమూరి వెంకటమ్మ (యశ్వంత్ తల్లి)
బ్యాంకు ఖాతా నంబర్- 73150040539
ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు, మునగాల బ్రాంచ్
ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్: ఏపీజీవీ0006210
సెల్ నంబర్: 8499094597

ఈ వ్యాధి శాపంగా మారింది



మాయదారి రోగం నా ఇద్దరు కూతుర్లను నాకు దూరం చేసింది. ఇప్పుడు మృత్యువుతో పోరాడుతున్న నా కుమారుడిని చూస్తుంటే కడుపు తరుక్కుపోతుంది. రెక్కాడితేగాని డొక్కాడని మా కుటుంబానికి ఈ జబ్బు శాపంగా మారింది. పగవాడికి కూడా ఇటువంటి పరిస్థితి కలగకూడదని ఆ భగవంతుడిని వేడుకుంటున్నాను.

– వెంకటమ్మ, యశ్వంత్ తల్లి

దాతలు సాయం చేయాలి



నా సోదరి కుమారుడిని బతికించుకోవడానికి లక్షల రూపాయలు అప్పుచేసినా ప్రాణాలు దక్కే పరిస్థితి లేదు. మృత్యువుకు దగ్గరలో ఉన్న ఆమె కుమారుడు కొంతకాలమైనా బతకాలనుకుంటే దాతలు ముందుకు వచ్చి తమకు తోచిన విధంగా ఆర్థిక సాయం చేయాలని కోరుతున్నాను.

– ముత్యాలు, యశ్వంత్ మేనమామ

కంటి వెలుగుతో తెలంగాణ రోల్‌మోడల్

- ఉమ్మడి జిల్లాలో 22లక్షల మందికి కంటి పరీక్షలు చేస్తాం
- కుడకుడలో కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభోత్సవంలో మంత్రి జగదీశ్‌రెడ్డి


కంటి పరీక్షలు చేయించుకుంటున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట : రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించిన కంటి వెలుగు కార్యక్రమంతో దేశంలోనే వైద్య రంగంలో తెలంగాణ రోల్‌మోడల్‌గా నిలుస్తుందని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. గురువారం కుడకుడ జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన కంటి పరీక్షలు చేయించకోగా ఎలాంటి సమస్యలేదని డాక్టర్లు నిర్ధారించారు. అనంతరం కంటి అద్దాలు పంపిణీ చేసి మాట్లాడారు. ఈ కంటి వెలుగు కార్యక్రమం దేశం మొత్తానికే వెలుగునిస్తుందన్నారు. సాధారణంగా పని చేసుకునే వారు తమ చూపును నిర్లక్ష్యం చేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వమే వారి వద్దకు వెళ్లి పరీక్షలు చేసి వారికి చూపును ఇవ్వాలనే ఆలోచనతో సీఎం చేపట్టిన బృహత్తర కార్యక్రమమే కంటి వెలుగు అని చెప్పారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 22లక్షల మందికి పరీక్షలు నిర్వహిస్తామని మంత్రి తెలిపారు. ప్రజలందరూ ఈ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్ , ఆర్డీఓ రాజేంద్రకుమార్, డీఎంహెచ్‌ఓ కోటాచలం, మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, మున్సిపల్ కమిషనర్ రామానుజుల రెడ్డి, స్థానిక కౌన్సిలర్ వేములకొండ పద్మ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ హర్షవర్ధన్, హెల్త్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సుదర్శన్, కౌన్సిలర్ బాషమియా తదితరులు పాల్గొన్నారు.

అలైన్‌మెంట్ మార్చు చేయాల్సిందే

- రాయగిరి రీజినల్ రింగ్ రోడ్డు బాధితుల డిమాండ్
- ఆర్డీఓ కార్యాలయంలో ప్రజాభిప్రాయ సేకరణ
- నేషనల్ హైవే అధికారులతో వాగ్వాదం


నేషనల్ హైవే అధికారులతో రైతుల వాగ్వాదం

భువనగిరి : రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణంతో తీవ్రంగా నష్టపోతున్నాం.. అలైన్‌మెంట్ మార్చాల్సిందేనని భువనగిరి మండలంలోని రాయగిరి రీజనల్ రింగ్ రోడ్డు బాధితులు డిమాండ్ చేశారు. గురువారం ఆర్డీఓ కార్యాలయంలో నేషనల్ హైవే అధికారులు, ఆర్డీఓ భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో అభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా బాధితులు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కార్యాలయంలోకి వెళ్లారు. రాయగిరి నుంచి వెళ్తున్న రీజనల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చడమే కాకుండా మొదటి అలైన్‌మెంట్ వివరాలను లిఖిత పూర్వకంగా తమకు ఇవ్వాలని, రింగ్ రోడ్డుకు, రింగ్ రోడ్డుకు మధ్య దూరం ఎంత ఉండాలో తెలియజేయాలన్నారు.

నేలపై బైఠాయించి నిరసన

నేషనల్ హైవే అధికారి రీజనల్ రింగ్‌రోడ్డు పరిధిలో భూములు కోల్పోతున్న సర్వే నంబర్లు, రైతుల వివరాలు వివరిస్తుండగా బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో అధికారులు చెప్పిన సమాధానం అసంతృప్తిగా ఉందని కార్యాలయంలో నేలపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సమయంలో ఆర్డీఓ భూపాల్‌రెడ్డి జోక్యం చేసుకొని నేషనల్ హైవే అధికారులతో చర్చించారు. మరోసారి అభిప్రాయ సేకరణ చేయడానికి సమవేశం ఏర్పాటు చేయాలని కోరడంతో అందుకు వారు అంగీకరించారు. అనంతరం బాధితులు ఆర్డీఓ, హైవే అధికారులకు వినతిపత్రం అందజేశారు. అక్కడి నుంచి ర్యాలీగా బయటకు వచ్చారు. ఈ కార్యక్రమంలో రైతులు, తంగళ్లపల్లి రవికుమార్, కాయితం వెంకట్‌రెడ్డి, మల్లేష్‌గౌడ్, ఈదల శ్రీకాంత్, గోపి, పల్లెర్ల యాదగిరి, నసునూరి నాగభూషణం, కొలను అర్జున్‌రెడ్డి, పాండు యాదవ్, అనిల్‌కుమార్, నాయినిచందర్, కూర వెంకటేష్, రామ్, చల్లగురుగుల రఘురాబు తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని మహిళ ఆత్మహత్య

- సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం ముత్తంగిలో ఘటన
- మృతురాలి సొంతూరు సూర్యాపేట జిల్లా మోతె మండలం హుసేనాబాద్

పటాన్‌చెరు టౌన్: సూర్యాపేట జిల్లా మోతె మండలానికి చెందిన మహిళ మానసికస్థితి సరిగాలేక అపార్ట్‌మెంట్ పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన గురువారం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పోలీస్స్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్‌ఐ రామానాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా మోతె మండలం హుసేనాబాద్ గ్రామానికి చెందిన పరశురామ్ బతుకుదెరువు నిమిత్తం వలస వెళ్లి సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం ముత్తంగిలోని కేవీఆర్ అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఇతడి రెండో కుమార్తె నవ్య(25)ను స్వగ్రామం హుసేనాబాద్‌కే చెందిన కిరణ్‌కు ఇచ్చి ఏడేళ్ల క్రితం వివాహం చేశారు. వీరికి ఒక కుమారుడు, కుమార్తె సంతానం. పరశురామ్ అల్లుడు కిరణ్ కూడా ముత్తంగిలోనే పక్క అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తూ అక్కడే నివాసం ఉంటున్నాడు. కాగా కొంతకాలంగా నవ్య అనారోగ్యంతో బాధపడుతోంది. మానసిక స్థితి సరిగా లేక ఆమె గతంలో రెండుసార్లు ఆత్మహత్యకు యత్నించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ క్రమంలో గురువారం అపార్ట్‌మెంట్ 5వ అంతస్తు పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనారోగ్య సమస్యతో తన కూతురు ఆత్మహత్య చేసుకుందని తండ్రి పరశురామ్ పోలీసుల ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం

మఠంపల్లి : మట్టపల్లి ఆలయంలో గురువారం శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మీసమేత శ్రీలక్ష్మీనరసింహాస్వామి కల్యాణాన్ని అత్యంత వైభవంగా అర్చకులు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో . ప్రాతఃకాలార్చన, సుప్రభాతసేవ, నిత్య అగ్నిహోత్రి, ప్రత్యేకార్చనలు చేశారు. అనంతరం అష్టోత్తర సహస్ర నామార్చన, కుంకుమార్చనలు చేపట్టారు. స్వామి అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవాన్ని రక్తికట్టించారు. నీరాజన మంత్రపుష్పాలతో మహానివేదన గావించారు. ఈ కార్యక్రమంలో చెన్నూరు విజయ్‌కుమార్, నవీన్, లక్ష్మణాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఫణిభూషణ మంగాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద దళితులకే ప్రాధాన్యమివ్వాలి

హుజూర్‌నగర్ : దళితబంధు పథకంలో నిరుపేద దళితులకే మొదటి ప్రాధాన్యమివ్వాలని టీఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పి.రవికుమార్, జాతీయ ప్రధాన కార్యదర్శి సీహెచ్.బాబు కోరారు. ఫిబ్రవరి 3న చేపట్టే కలెక్టరేట్‌ల వద్ద ధర్నా కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను గురువారం హుజూర్‌నగర్‌లోని టౌన్ హాల్‌లో స్థానిక నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దళితబంధు కోసం దళితుల ఆత్మగౌరవాన్ని ఎమ్మెల్యే ముందు తాకట్టు పెట్టాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫిబ్రవరి 3న చేపట్టే ధర్నా కార్యక్రమంలో దళితులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.లక్ష్మణ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బి.నాగరాజు, నాయకులు కె.రామయ్య, కె.పెంటయ్య, కె.జానయ్య, డి.రమేష్, వి.జయరాజ్, ఎం.వెంకటేశ్వర్లు, ఆర్.నాగరాజు, కె.సుధాకర్, పి.వెంకటనారాయణ, సీహెచ్.సైదులు పాల్గొన్నారు.

హామీలను విస్మరించిన కేసీఆర్


పాదయాత్రలో పాల్గొన్న పటేల్ రమేష్‌రెడ్డి

సూర్యాపేట రూరల్: సీఎం కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించారని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని రామారం, అచ్చతండా, హనుమతండా, యండ్లపల్లి, లాల్‌తండాల్లో రెండో రోజు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులకు రిజర్వేషన్లు పెంచుతామని ఇచ్చిన హామీని గాలికి వదిలేశారన్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన తండా గ్రామ పంచాయతీలకు నిధులు కేటాయించడం లేదన్నారు. రైతు రుణమాఫీని వెంటనే ప్రకటించాలని, దళిత బంధు ప్రతి ఒక్కరికీ అమలు చేయాలన్నారు. ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు, ఆసరా పెన్షన్లు అర్హులైనవారికి ఇవ్వాలనిడిమాండ్ చేశారు. కార్యక్రమంలో ధరావత్ వెంకన్న, గట్టు శ్రీనివాస్, రమేష్‌నాయుడు, షఫీఉల్లా, వెలుగు వెంకన్న, నామ ప్రవీణ్, వల్దాసు దేవేందర్, వేణుగోపాల్‌రెడ్డి, పాలవరపు వేణు, స్వామి నాయుడు, సైదిరెడ్డి పాల్గొన్నారు.

వాహనాల వేలంతో రూ. 9.35 లక్షలు ఆదాయం


వేలం నిర్వహిస్తున్న సూర్యాపేట జిల్లా ఎక్సైజ్ అధికారి అనిత తదితరులు

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ ఎక్సైజ్ పరిధిలో వివిధ కేసులల్లో సీజ్ చేసిన వాహనాలకు గురువారం హుజూర్‌నగర్ ఎక్సైజ్ స్టేషన్‌లో సూర్యాపేట జిల్లా ఎక్సైజ్ అధికారి కె. అనిత ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ.. 21 వాహనాలకు వేలం నిర్వహించగా రూ 9.35లక్షల ఆదాయం ప్రభుత్వం ఖజానాకు సమకూరిందని తెలిపారు. సుమారు రూ.3లక్షల ఆదాయం లభిస్తుందని అంచనా వేయగా 3 రెట్లు అధికంగా ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ ఏలె శ్రీనివాస్, ఎస్‌ఐలు సతీష్‌రెడ్డి, వెంకన్న, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శ్రవణ్‌రెడ్డి మృతిపై కేసు నమోదు

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి మండలం తిప్పలమ్మగూడెం గ్రామానికి చెందిన వల్లపురెడ్డి శ్రవణ్‌రెడ్డి పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకోగా గురువారం అతడి తల్లి జానకమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తిప్పర్తి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నకిరేకల్ మండలం ఆర్లగడ్డగూడెం గ్రామానికి చెందిన బాలికతో ప్రేమ వ్యవహారంలో 2021 అక్టోబర్ నెలలో శ్రవణ్‌రెడ్డిపై కేసు నమోదు కాగా, అతడికి మూడు నెలలు జైలుశిక్ష పడింది. ఇదిలా ఉండగా మంగళవారం రాత్రి శ్రవణ్‌రెడ్డి పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయడంతో చికిత్స నిమిత్తం నల్లగొండ ఆస్పత్రికి తరలించగా బుధవారం సాయంత్రం మృతిచెందాడు. ఈ మేరకు మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

దొంగను చితకబాది పోలీసులకు అప్పగింత

నల్లగొండ క్రైం: నల్లగొండ మండలంలోని దీపకుంట గ్రామానికి చెందిన గూడూరు మనీలా నివాసంలో గురువారం చోరీకి యత్నించిన దొంగను గ్రామస్తులు చితకబాది పోలీసులకు అప్పగించారు. నల్లగొండ రూరల్ ఎస్సై భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మనీలా ఇంటికి తాళం వేసి వ్యవసాయ పనులకు వెళ్లగా చండూరుకు చెందిన మధు ఇంటి తాళం పగులగొట్టి చోరీకి యత్నించాడు. శబ్దం రావడంతో ఇంటి చుట్టుపక్కల వారు గమనించి మధును పట్టుకుంటుండగా తన వద్ద ఉన్న చాకుతో బెదిరించాడు. దీంతో గామస్తులు కర్రలతో దాడి చేసి మధును పట్టుకుని నల్లగొండ రూరల్ పోలీసులకు అప్పగించారు. దొంగకు నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని, ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గోదావరి జలాల నిలిపివేత

అర్వపల్లి: జిల్లాకు వస్తున్న గోదావరి జలాలను గురువారం నిలిపివేశారు. యాసంగి సీజన్‌కుగాను గతనెల 26న నీటిని విడుదల చేశారు. వారబందీ విధానం అమలు చేస్తున్నందున ఈ నెల 25 వతేదీ తర్వాత తిరిగి నీటిని పునరుద్ధరించనున్నట్లు అధికారులు తెలిపారు.

ఉద్యమ ఆకాంక్షల సాధనకు పునరంకితం కావాలి


వేణుగోపాల్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తెలంగాణ జనసమితి నాయికులు

భానుపురి (సూర్యాపేట): తెలంగాణ ఉద్యమ ఆకాంక్షల కోసం పునరంకితం కావాలని తెలంగాణ జనసమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సూర్యాపేట నియోజకవర్గ ఇన్‌చార్జి ధర్మార్జున్ పిలుపునిచ్చారు. తెలంగాణ మలిదశ అమరుడు కొండేటి వేణుగోపాల్‌రెడ్డి 13వ వర్ధంతి సందర్భంగా గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో తెలంగాణ తల్లి విగ్రహం వద్ద వేణుగోపాల్‌రెడ్డి చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలను ముఖ్యమంత్రి కేసీఆర్ తన స్వార్థం కొరకు ఉపయోగించుకుంటున్నారని విమర్శించారు. తెలంగాణ అమరుల రక్తపు మరకలతో అధికారాన్ని చేజిక్కించుకున్న కేసీఆర్ ఖమ్మంలో జరిగిన బీఆర్‌ఎస్ సభలో కనీసం అమరులకు నివాళులర్పించలేదని, జై తెలంగాణ నినాదం ఇవ్వడానికి కూడా సిగ్గుపడ్డాడని, ఇది మొత్తం తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసినట్లుగానే తెలంగాణ సమాజం భావిస్తుందన్నారు. కేసీఆర్ బేషరతుగా తెలంగాణ సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ జనసమితి జిల్లా అధ్యక్షుడు మాండ్ర మల్లయ్య, యువజన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు తెలంగాణ అమరుల బంధుమిత్రుల కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిద్ధారెడ్డి, తెలంగాణ జనసమితి లీగల్ సెల్ జిల్లా కన్వీనర్ కొంచెం చంద్రకాంత్, ధైద వెంకన్న, బండి రవి, తెలంగాణ జన సమితి పట్టణ అధ్యక్షుడు బంధన్ నాయక్, బొడ్డు శంకర్ గౌడ్, ఈశ్వర్ సింగ్, నక్క సాయి, బిసు స్వామి, ఖలీల్ హమీద్, దేవత్ హరీష్ తదితరులు పాల్గొన్నారు.

పుచ్చపంట సాగుతో లాభాల బాట

- యాభై ఎకరాల్లో సాగు చేస్తున్న బుద్ధారెడ్డిగూడెం రైతు
- ఎకరాకు రూ.లక్ష నికర ఆదాయం

పాడి పంట


కొప్పోలులో సాగవుతున్న పుచ్చ పంట

గుర్రంపోడు: మండలంలో పుచ్చకాయ సాగు విస్తీర్ణం గత రెండేళ్లుగా రికార్డు స్థాయిలో పెరుగుతుంది. రెండు నెలల్లో ఆదాయం వచ్చే ఈ పంటను మండలంలో దాదాపు వెయ్యి ఎకరాల్లో సాగు చేస్తున్నట్లు అంచనా. నీటి వసతి గల చోట్ల పత్తి కట్టెను తొలగించి రైతులు పుచ్చసాగుకు సిద్ధపడుతున్నారు. అంతేకాకుండా బత్తాయి తోటల్లో అంతర పంటగా పుచ్చ సాగు చేపడుతున్నారు. మల్చింగ్ షీట్‌లు, డ్రిప్ వంటి ఆధునిక పద్ధతుల ద్వారా విరివిగా పుచ్చసాగు చేస్తూ రైతులు లాభాలు గడిస్తున్నారు. మండలంలోని కొప్పోలు గ్రామ పరిధిలోనే రెండు వందల ఎకరాల్లో పుచ్చసాగు చేస్తున్నారు. బుద్ధారెడ్డిగూడెం గ్రామానికి చెందిన రైతు బొల్లం యాదయ్య భూములు కౌలుకు తీసుకుని 50 ఎకరాల్లో పుచ్చ సాగు చేస్తూ ఇతర రైతులకు మార్గదర్శకుడిగా నిలుస్తున్నాడు.

పదేళ్ల అనుభవం

గత పదేళ్లుగా రైతు బొల్లం యాదయ్య నవంబర్ నెల నుంచి జూన్ వరకు భూములు కౌలుకు తీసుకుని పలు దపాలుగా పుచ్చసాగు చేస్తున్నాడు. కొప్పోలు పరిధిలో చాలా గ్రామాల్లో కౌలు దొరికిన చోటల్లా పుచ్చసాగు చేస్తూ ప్రతిరోజూ పది మంది కూలీలకు వరుసగా ఆరు నెలలు ఉపాధి కల్పిస్తున్నాడు. నీటి సదుపాయం ఉన్న చోట్ల ఎకరాకు ఎనిమిది వేల వరకు భూములు కౌలుకు తీసుకుని మల్చింగ్ షీట్లు, డ్రిప్ ఏర్పాటు చేసుకుని శాస్త్రీయ పద్ధతుల్లో పుచ్చసాగు చేస్తున్నాడు. ప్రస్తుతం తేనపల్లి గ్రామంలో 10ఎకరాల్లో తాను సాగు చేసిన పుచ్చ పంట కోత దశలో ఉందని రైతు యాదయ్య తెలిపారు. ఎక్కువగా మెలికానా క్యాండీ, బాహుబలి-2 రకం పుచ్చను సాగుచేస్తున్నానని, వివిధ దశల్లో మార్చి నెలాఖరు వరకు గింజలు నాటుతానని ఆయన పేర్కొన్నారు.

రూ. లక్ష ఆదాయం వచ్చింది



ఎకరా భూమిలో పుచ్చసాగు చేస్తే రెండున్నర నెలల్లోనే రూ.లక్ష నికర ఆదాయం లభిస్తుంది. ఎకరాకు సాధారణ దిగుబడి 25 నుంచి 30 టన్నులు కాగా, తోటల వద్ద కిలోకు రూ.8 నుంచి రూ.10 చెల్లించి వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. రూ.8 లెక్కన చూసుకున్నా ఎకరాకు మొదటి కోతలో 20టన్నుల దిగుబడి రాగా రూ.1.60లక్షలు ఆదాయం వచ్చింది. రెండో దిగుబడి(చిన్నసైజు కాయలు)లో కిలో రూ.4 లెక్కన పది టన్నులకు రూ.40వేలు ఆదాయం లభిస్తుంది. మొత్తం రెండు దఫాల్లో ఎకరాకు వచ్చే రూ.70వేలు పెట్టుబడి పోగా రూ.1.30లక్షలు ఆదాయం వస్తుంది. ధర, దిగుబడుల్లో తేడాలు వచ్చినా రూ.లక్ష నికర ఆదాయం లభిస్తుంది.

– బొల్లం యాదయ్య, రైతు, బుద్ధారెడ్డిగూడెం